# జాగృతి

సంవత్సరం : ౩ సంచిక : ౦౨

సంపాదకులు : శ్యామ్ కుమార్ మేడూరి

జనవరి ౨౦౦౮

## ఈ సంచికలో

గీతామృతం ........................................ ౧
పునరారంభం .................................... ౨
సంతోషం కోసం ................................ ౩
బోధ కథ ............................................ ౪

## జనవరి మాసంలో

౧౦ : లాల్ బహాదుర్ శాస్త్రి వర్ధంతి
౧౨ : స్వామీ వివేకానంద జయంతి
౨౩ : సుభాష్ చంద్ర బోస్ జయంతి
౧౫ : సంక్రాంతి
౨౬ : గణతంత్ర దినోత్సవం
౨౮ : లాలా లజ్పత్ రాయ్ జయంతి
౩౦ : మహాత్మా గాంధీ వర్ధంతి

## తెలుగు అంకెలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 0 |
| ౧ | ౨ | ౩ | ౪ | ౫ | ౬ | ౭ | ౮ | ౯ | ౦ |

## Quote

India – The land of Vedas, the remarkable works contain not only religious ideas for a perfect life, but also facts which science has proved true. Electricity, radium, electronics, airship, all were known to the seers who founded the Vedas.

- *Wheeler Wilcox (American poet)*

## *గీతామృతం*

**దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగాద్ధనంజయ ।**
**బుద్ధౌ శరణమన్విచ్ఛ కృపణాః ఫలహేతవః ॥ ౨ - ౪౯ ॥**

**భావము:** "నిస్వార్థ మరియు నిష్కామ కర్మతో పోలిస్తే సకామ కర్మ చాలా నికృష్టమైనది, కనుక నీవు సమత్వ-బుద్ధినే ఆశ్రయించు, కర్మఫలం యందు ఆసక్తి ఉన్నవారు చాలా తుచ్ఛమైనవారు."

**వ్యాఖ్య:** సామాన్య జనులు, యోగం అంటే ప్రాపంచిక సంబంధాలను తెంచివెసుకుని, వనాలలోనో లేక పర్వత శిఖరాలలోనో నివసిస్తూ కంద-మూలాదులు మరియు పండ్లు మాత్రమే తింటూ తపస్సు చేసుకుంటూ మరియు కఠోర శారిరిక యాతనంతో కూడిన జీవితాన్ని సాగించడం, అని భావిస్తారు. కాని భగవద్గీత ఉపదేశం ప్రకారం అన్ని ప్రాపంచిక సంఘటనల యందు మానసిక సమత్వాన్ని కలిగి ఉండడాన్నే యోగం అంటారు. వ్యవస్థిత మనస్సు-బుద్ధితోనే మనము సమస్యలను స్పష్టంగా అర్థం చేసుకోగలము, సరైన నిర్ణయాన్ని తీసుకోగలము మరియు ఎక్కువ సఫలత్వాన్ని పొందగలము. కనుక కర్మఫలం యందు లోభం ఉంచకుండా మన సమస్త కర్మలను చిత్తశుద్ధితో మరియు సంపూర్ణ సమర్పణ భావంతో నిర్వహించాలి. మనము మన సమస్త కర్మలను, అవి సేవా కార్యాలు ఆయినా లేక మన సొంత పనులు అయినా, మనని మనము అంతరంగంలోనూ మరియు బాహ్యంలోనూ సుందరంగా మరియు సూశీలంగా తయారు చేసుకొనుటకు అన్నట్లు చేయాలి. అలాంటి సమత్వ-బుద్ధి యుక్తమైన, ఆసక్తి లేని జీవితమే దృఢమైన ఆధ్యాత్మిక జీవనానికి సరైన ప్రయత్నము. దానినే యోగం అంటారు.

భగవద్గీత యొక్క మిగతా శ్లోకాల లాగే ఈ శ్లోకం కూడా, భగవద్గీత వృద్ధులకు, రోగులకు మరియు మృత్యువుకు చేరువలో ఉన్నవారికి మాత్రమే కాదు, ఇది ఇప్పుడే జీవితంలో అడుగుపెట్టి, కార్యక్షేత్రంలోకి దూకి, పోరాడడానికి, పరిశ్రమ చేయడానికి మరియు సఫలత్వాన్ని సాధించాలన్న ఉత్సాహం కలిగి ఉన్నవారికే ఎక్కువగా సంబంధించినది, అన్న విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. కనుక అందరూ భగవద్గీత ఉపదేశాలను తమ జీవితంలో ఆచరణలోనికి తేవడానికి ప్రయత్నం చేయాలి.

## పునరారంభం

కొన్ని నెలల వ్యవధి తరువాత ఈ పత్రిక పునరారంభం జరుగుతోంది. గత ౪ నెలలలో కేవలం ఒక్కసారి మాత్రమే పత్రికను విడుదల చేయడం జరిగింది. ౨౦౦౫ సెప్టెంబరు మాసం సంచికతో పత్రిక మొదలెట్టినప్పటినుండి ఒక్క నెల కూడా విడువకుండా ౨౦౦౬ ఆగష్టు సంచిక వరకు వరుసగా సంచికలు వెలువడుతూనే ఉన్నాయి. కానీ ఆ తరువాత నుండి ఇప్పటివరకు కేవలం ఒకటే సంచిక వెలువడింది. కొన్ని కారణాల వల్ల క్రమము తప్పింది. దీనికి కారణం నేను కొంత వృత్తిపరమైన పనులలో మరియు కొంత సొంత పనులలో వ్యస్థత చెంది ఉండడం అయితే, కొంతవరకు నిరుత్సాహం కుడా కారణమయ్యింది. పత్రికలో ప్రమరించే వ్యాసాలు చాలా మటుకు నావి లేక హిందీ పత్రిక 'నవనిర్మాణ్' సంపాదకులు ముకేష్ గారివే కావడంతో ఇతరుల నుండి పత్రికకు వ్యాసాల రూపంలో సహాయం తక్కువగా ఉండటం కూడా కొంతం నిరుత్సాహానికి కారణం. ఈ సమయంలోనే ముకేష్ గారు తమ కుటుంబ మరియు కార్యాలయ పనులలో వ్యస్థత చెందియుండడంవల్ల ఆయన కూడా పత్రిక పనిలో సమయం కేటాయించడం కష్టమవడం వల్ల కూడా గత కొన్ని నెలల సంచికలు విడుదల అవ్వలేక పోయాయి.

కారణమేదైనప్పటికీ ఎలా అయినా సరే ఇక మీదట మరల పత్రికను క్రమం తప్పకుండా విడుదల చేయాలని నిశ్చయించుకుని ఈ నెల సంచికను తయారుచేయడానికి పూనుకున్నాను. ఇదే సమయంలో ఇక్కడ (డెనమార్కు లో) ఒక టీ.వీ. చానెల్ లో ఒక రోజు గాంధీ సినిమా వేస్తే అది చూసాను. విచిత్రమేమిటంటే మన భారతీయ చానెల్ లో ఈ మధ్య ఈ సినిమాని వేయటం చూడలేదు, కాని నేను ఇక్కడకి వచ్చినప్పటి నుండి అంటే గత ఏడాది కాలంలో కనీసం మూడు సార్లు అయినా ఇక్కడి ఏదో ఒక చానెల్ లో ఈ సినిమాని వేయడం జరిగింది. మన మూలాలను మనమే మరచిపోవడం అంటే ఇదే కాబోలు. గాంధీ ఆత్మకథ చదివినా ఆయన రచనలను చదివినా మనస్సుకు ఉల్లాసంగా మరియు ఎంతో స్ఫూర్తిదాయకంగా అనిపిస్తుంది. అలాగే ఈ సినిమా చూసినప్పుడల్లా చాలా స్ఫూర్తిదాయకంగా అనిపిస్తుంది. ఈ సినిమాలోని ఒక సన్నివేశంలో గోపాల కృష్ణ గోఖలే గారు గాంధీగారిని తన వకీలు పనిని వదిలివేసి దేశసేవలో తన సమయాన్నంతా వినియోగించమని దానికి కావలసిన ధన సహాయం వారికి అందేలాగ తను చూసుకుంటాను అని చెప్తారు. గాంధీగారు తమ ఆత్మకథలో కూడా గోపాల కృష్ణ గోఖలే గారిని తమ గురువుగా తమకు స్ఫూర్తి ప్రదాతగా భావించినట్లు వర్ణించారు. ఆ సన్నివేశం చూసినప్పుడు అనిపించింది, నాకు కూడా అలాంటి స్ఫూర్తినిచ్చే గురువు దొరికితే ఎంత బావుంటుందో అని. కానీ మన తత్వశాస్త్రాలలో మరియు ఎందరో ఆధ్యాత్మిక గురువులు చెప్పినట్లు మన అర్హతను బట్టే మనకు ఏదైనా లభిస్తుంది, అది గురువు విషయంలో కూడా వర్తిస్తుంది. మనకు సరైన అర్హత వచ్చినప్పుడు మనకు మార్గదర్శన చేసే గురువు కూడా లభిస్తారు అన్న విషయాన్ని మననం చేసుకున్నాను. అలాంటి అర్హత పొందేవరకు బాగా కృషి చేయలన్న సంకల్పం కలిగింది.

పత్రిక వల్ల మిగతా ఎవరికి ఎలాంటి లాభం ఉన్నా-లేకపోయినా కనీసం నా వరకు నాకు చాలా మేలే కలిగిందని నేను భావిస్తున్నాను. పత్రికల పని, హిందీ తెలుగు భాషలపై నా పట్టు పెరగడానికి ఎంతో దోహదం చేసింది. అలాగే వివిధ సామాజిక, రాజకీయ విషయాలు మరియు సమస్యలపై అవగాహన పెరిగి ఆయా సమస్యల పరిష్కారాల గురించి వివిధ అభిప్రాయాలు స్ఫురించేందుకు కూడా సహాయకరం అయ్యింది. కనుక పత్రిక ప్రస్తుతానికి బహుజన లాభదాయకం అయినా-కాకపోయినా కనీసం ఒక్కడికి (నాకు) అయినా బహువిధ లాభదాయకంగానే ఉండిందని గ్రహించి నూతన సంకల్పంతో మరల పత్రికను క్రమం తప్పకుండా విడుదల చేసే పనిని పునరారంభించాలని నిశ్చయించుకున్నాను. మిత్రులెవరైనా పత్రికకు వ్యాసాల రూపంలో కాని మరే శ్రమదానం రూపంలో అయినా సహకరంచదలచుకుంటే అది నాకు మరింత ఉత్సాహాన్ని ఇవ్వగలదు.

— *శ్యామ్ కుమార్ మేడూరి*

## సంతోషం కోసం

సంతోషం కోసం మనం రకరకాల ప్రయత్నాలు చేస్తూ పరుగులు తీస్తూ ఉంటాము. సంతోషం కోసమే మానవుడు దేశ-విదేశాలకు వేళ్ళి పడరాని పాట్లు పడి ధనం సంపాదించి, సౌకర్యాలను సమకూర్చుకోవడానికి ప్రయత్నిస్తూంటాడు. తన ఉల్లాసానికి తన చుట్టూ రకరకాల హంగులతో కూడిన సదుపాయాలను సమకూర్చుకుని, తనను తను వివిధ రకాల వ్యసనాలలో లిప్తం చేసుకుని తద్వారా సంతోషాన్ని సాధించాలని ప్రయత్నిస్తూంటాడు. అయినా అతని చేతికి సంతోషం చిక్కకపోగా అది అతనికి మరింత దూరమవుతూంటుంది. అయినప్పటికీ మనం తాత్కాలిక సంతోషాన్ని అందించే సాధనాల వెనకే పడతాం తప్ప శాశ్వతమైన సంతోషాన్ని అనగా ఆనందాన్ని సంపాదించడం ఎలా అన్న దాని గురించి అసలు ఆలోచించము.

ఈ మధ్య కాలంలోనే బీ.బీ.సీ చానెల్ లో ఈ విషయంపైనే ఒక కార్యక్రమాన్ని ప్రసారం చేసారు. ఆ కార్యక్రమంలో వివిధ దేశాల ప్రజలు వారి ప్రభుత్వాలు ప్రజలలో సంతోషాన్ని పెంపొందించడానికి చేస్తున్న వివిధ యత్నాల గురించి చెప్పడం జరిగింది. దీనిలో భాగంగా భారతదేశం పొరుగు దేశమైన భూటాన్ లో ప్రజల సంతోషం కోసం అక్కడి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల గురించి కూడా చెప్పబడింది. ఉదాహరణకు భూటాన్ లో సిగరెట్ మరియు ప్లాస్టిక్ సంచులపై నిషేధం ఉంది. వాటి వల్ల ప్రభుత్వ ఆదాయం తద్వారా దేశ ఆదాయంలో వృద్ధి జరిగినా, అవి జనావళి సంతోషం పరిమాణాన్ని తగ్గిస్తాయి అని వాటి మీద నిషేధం విధించడం జరిగింది. భూటాన్ లో ఇతర దేశాలలో లాగ ప్రతి మనిషి ఆదాయం (Per Capita Income) బదులు ప్రతి మనిషి సంతోషం పరిమాణంకు (Per Happiness Level) ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వడం జరిగింది. తాత్కాలిక సంతోషం బదులు శాశ్వత సంతోషానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వడానికి ఇది నిదర్శనం. కాని నాకు ఆశ్చర్యం కలిగించిన విషయమేమిటంటే భూటాన్ లాంటి దేశాలకు ఆధ్యాత్మిక తత్వం వ్యాపించడానికి మూలస్థానం అయిన భారతదేశంలో సాధారణ ఆలోచనా సరళి మరియు ప్రభుత్వ విధానాలు దీనికి భిన్నంగా పశ్చిమ దేశాలను గ్రుడ్డిగా అనుసరించే విధంగా ఉన్నది. భారతదేశంలో నేడు ఎక్కడ చూసినా ఆధ్యాత్మికత బదులు భౌతికవాదం ఛాయలే బాగా కనపడుతున్నాయి.

సాధారణంగా ప్రభుత్వాల ఆలోచనా ధోరణి ఇలా ఉంటే మరో ప్రక్క సాధారణ వ్యక్తులు కూడా తాత్కాలిక సంతోషాన్ని ఇచ్చే సాధానాలే మెరుగన్న భ్రమలో మెలుగుతున్నారు. కార్యక్షేత్రంలో కూడా ఇలాంటి విషయాల వైపే ఎక్కువ మొగ్గు చూపిస్తున్నట్లు అనిపిస్తుంది. కొంత మంది తరచు తమ పనుల నుండి ఎలా ఎడతెరపి దొరుకుతుందా, ఎప్పుడు ఉల్లాస సాధనాలతోనే సమయం గడపాలన్న ఆలోచనలో ఉంటారు. అయితే వీరు ఎడతెరపి కావలనుకొనేది చాలా శ్రమ పడిపోవడం వల్ల కాదు. ఈ పరిస్థితికి కారణం వారు వారి పనిని వారి సంతోషానికి అడ్డంకిగా భావించడం. అయితే మరి కొంత మంది శ్రమ పడి పని చేసినా అది వారి అధికారి మెప్పు కోసమో లేక ధనం కోసమో లేక వృత్తిపరమైన లాభం కోసమో, ఇలాంటి బాహ్య కారణాల వల్లనే అవుతుంది. ఇలా కాక తమ పని ద్వారానే సంతోషాన్ని పొందగలిగినప్పుడు అసలు ఇలాంటి ఇబ్బందులే కలుగవు. అసలు తాము రోజూ చేసే ప్రతి కార్యం ఆవశ్యకమేనన్న విషయాన్ని గ్రహిస్తే పనికి-ఉల్లాసానికి మధ్య కనపడుతున్న ఈ ఘర్షణ ఉండనే ఉండదు. తమ పని తాము చేసుకోవడమే భగవంతుడికి చేసే అత్యున్నత సేవ అంటారు. కాని పనియే భగవంతుడు అని నేను అంటాను. పనినే భగవంతుడిగా భావిస్తే ఇక సంతోషాన్ని వేరే చోట వెతుక్కోవాల్సిన అవసరమేమి ఉంది. కాని దురదృష్టవశాత్తు గొప్ప డిగ్రీలు సాధించి మంచి ఉద్యగాలు చేస్తున్న పట్టభద్రులే ఇలా ఆలోచించే పరిస్థితిలో లేరు. వీరి కన్నా చాలా తక్కువ జీతాలతో చాలా శ్రమపడి కాయా కష్టం చేసుకునే వారే నయం. వారి పొట్టను పోషించుకోవడానికి ఉపయోగపడే  పనిలోనే వారు భగవంతుడిని చూసుకుంటారు, ఎందుకంటే ఉల్లాసం కోసమని వారి పనిని వారు మానెయ్యరు కదా! ఈ సమస్య కేవలం పరిస్థితులు బాగా ఉన్న మన లాంటి వాళ్ళకే ఉన్నది కనుక మనము నిజమైన మరియు శాశ్వతమైన సంతోషం మనలోనే ఉన్నదని గ్రహించి మనం చేసే ప్రతి పనిలో ఆనందాన్ని అనుభవించాలి.

– *శ్యామ్ కుమార్ మేడూరి*

## బోధ కథ (అవసరం చిన్నదైనా అనేక బంధాలను కొనితెస్తుంది) - శ్రీరామకృష్ణ కథామృతం నుండి

"ఒక సన్యాసి అడవిలో ఏకాంతంగా తపస్సు చేసుకుంటున్నాడు. నావి అనేవి అతడికి రెండు గోచీలు మాత్రమే. ఒకరోజు ఆ రెండు గోచీలలో ఒకదాన్ని ఒక ఎలుక కొంచెం కొరికింది. ఇక రెండవ దాన్ని కూడా కొరికితే ఇబ్బంది అవుతుంది కదా! అందువల్ల ఆ కౌపీనాన్ని కాపాడడానికి ఒక పిల్లిని తెచ్చి పెంచసాగాడు. పిల్లికి పాలు కావాలి. అందువల్ల పాలకోసం ఒక పాడి ఆవును సంపాదించాడు. పాడియావును మేపడానికి, పాలు పితకడానికి ఒక జీతగాడు కావలసివచ్చాడు. అలా జీతగాడు రావడంతో ఆవులమంద పెరిగిపోయింది. ఆ మందను మేపడానికి పచ్చిక బయళ్ళు, పొలాలు క్రమంగా పెరిగిపోయి ఆ సన్యాసి ఒక పెద్ద భూస్వామిలా తయారయ్యాడు. ఇక అంత పెద్ద సంసారాన్ని సరిదిద్దడానికి అతడికి భార్యకూడా అవసరమైంది. చివరకు పెళ్ళి కూడా చేసుకున్నాడు."

"కాలచక్రం తిరిగిపోతున్నది. ఈ సంసారం పెరిగిపోతున్నది. ఇలావుండగా ఒకరోజు ఇతని స్నేహితుడైన మరొక సన్యాసి అడవిలో వెతుక్కుంటూ ఇతనిని చూడటానికి వచ్చాడు. అక్కడ ఏర్పడిన ఆ పటాటోపాన్ని చూచి ఆ సన్యాసి ఈ 'సన్యాసి-గృహస్థు'తో, 'ఇదేమిటి ఇలా తయారయ్యావు?' అని ప్రశ్నించాడు. దానికి ఆ 'సన్యాసి-గృహస్థు', 'కౌపీన సంరక్షణార్థం అయం పటాటోపః' (గోచీని కాపాడడానికే ఈ పటాటోపమంతా ఏర్పడింది) అని సమాధానం చెప్పాడు."

ఈ కథను గురుదేవులు తరచుగా శిష్యులకు చెబుతూండేవారు. ఒకసారి దీనిని నరేంద్ర బెనర్జీ, మహేంద్రనాథ గుప్త(యం), హరి (తరువాత తురీయానందస్వామి) - ఈ ముగ్గురికీ చెప్పారు. ఆ సమయంలో నరేంద్రబెనర్జీ కుటుంబచిక్కులవల్ల వేరే ఇల్లుతీసుకొని తన భార్యతో కాపురం పెట్టాడు. అదే విధంగా కుటుంబసమస్యలవల్ల మహేంద్రుడు కూడా భార్యతో వేరే కాపురం పెట్టాడు. ఇక హరి, తన అన్న ఇంటిలోవుంటూ మెట్రిక్యులేషన్ వరకు చదివి, తరువాత విద్యాభ్యాసం మాని, సద్గ్రంథపఠనంలోను, భగవద్ధ్యానంలోను కాలం గడుపుతున్నాడు.

గురుదేవులు ఈ కథను ఆ ముగ్గురి హృదయాలకు సూటిగా తగిలేలా చెప్పి ఇంకా ఇలా అన్నారు: "చూడండి! ఈ కష్టాలన్నీ గోచీపాత కోసమే. మానవుడు పెళ్ళిచేసుకొని పిల్లల్ని కంటాడు. వాళ్ళకోసం ఉద్యోగం చేసి సంపాదించాల్సి వస్తుంది. గోచీపాత కోసం ఆ సాధువు బాధపడినట్లే, గృహస్థు తన భార్యకోసం బాధపడతాడు. అందువల్లనే గృహస్థు తన ఇంట్లో ఇతర బంధువులతో అన్యోన్యయంగా ఉండలేకపోతాడు కూడా! అందుకే భార్యతో వెళ్ళిపోయి వేరే కాపురం పెడతాడు. ఆ కారణంవల్ల చైతన్యమహాప్రభువు ఒకసారి నిత్యానందునితో ఇలా అన్నారు: 'సోదరా! నా మాటవిను! సంసారంలో ఒక్కసారి చిక్కుకున్న వాడు బయటపడనే పడలేడు.'

## భర్తృహరి సుభాషితము

అమరుఁ జెవి శాస్త్రమునఁ గుండలమునఁ గాదు
వలయమున నొప్పు, దీవిచే వెలయుఁ బాణి
యురుదయాఢ్యులమేను పరోపకార
వలన రాణించు గంధంబు వలనఁ గాదు.

**భావం:** చెవికి శాస్త్రము యింపుగా వుంటుంది - చెవిపోగులు వలన కాదు. చేయి కంకణము వలన కాదు దానముచే నొప్పును. బలశాలుర శరీరము పరోపకారము వలన ప్రకాశిస్తుంది చందనం వలన కాదు.

**Email:** jaagruthi_pathrika@yahoo.co.in
shyamkm@gmail.com
**Group:** http://groups.yahoo.com/group/viveknidhi/
**Website:** http://www.geocities.com/nbsabha/